రుదుపు కథ

# పాము

—కె.రామకృష్ణారెడ్డి

ఎక్కడా ఆగకుండా పరిగెత్తడంవల్ల ఆయాసం తన్నుకొస్తోంది. ఢమరుకంలా ధ్వనిస్తోంది నా గుండె.

లిప్తకాలంపాటు ఆయాసం తీర్చుకోవాలన్న కోరికను బలవంతంగా అణుచుకుని పరిగెత్తుతున్నాను.

అమావాస్య కాబోలు నా చుట్టూ చిక్కని చీకటి ఆవరించివుంది, ఎదురుగా ఏమీ కన్పించటంలేదు, అయినా ఆగకుండా పరిగెత్తుతున్నాను ఆ చీకట్లోనే.

డిసెంబరు నెల కావటం మూలాన నేను వేసుకున్న స్వెటర్ పూర్తిగా చెమటతో తడిసిపోతోంది. నాలుక పిడచకట్టుకుపోసాగింది.

ఎక్కడన్నా కాసిన్ని మంచినీళ్లు దొరుకుతాయేమోనని చూస్తూ పరిగెత్తుతున్నాను. నా పిచ్చిగానీ, ఈ చీకట్లో నాకు దారే కన్పించట్లేదు సరిగ్గా. ఇంకా నీళ్ల జాడ కనిపిస్తుందా?

ఎక్కడో లీలగా గలగలమని చప్పుడు వినిపించింది, తక్కున ఆగిపోయి చెవులు రిక్కించి విన్నాను. నీటి శబ్దం, నాకు ముందు వేపు నుంచి వస్తోంది. ఆకలిగొన్న వాడికి ఏకంగా అమృతం దొరికినట్టయింది నాకు, ఇనుమడించిన ఉత్సాహంతో పరిగెత్తసాగాను ఆ నీటి గల గలవైపు.

భూమి అంచుదాకా వచ్చాను కాబోలు, ఒక్కసారిగా అగాధంలోకి జారాను. ఈ చీకట్లో ఏమీ కన్పించట్లేదు. నేను మాత్రం కిందికి జారుతూనే వున్నాను. చిత్రంగా నాకు భయం వేయట్లేదసలు. చుట్టూ కాళ్లా చేతులు ఆడించాను, ఏదైనా పట్టు దొరుకుతుందేమోనని. ఊహూ... ఏం లాభం లేదు?

ఒక్కసారిగా ధబ్బుమని పడ్డాను. చుట్టూ చూసాను ఎక్కడ పడ్డానా అని, కన్ను పొడుచుకున్నా కాన రానంతటి చీకటి. కింద పడ్డా దెబ్బలేం తగల్లేదు. కింద మెత్తగా వుంది 'కుషన్' పరుపులా. 'వాటర్ బెడ్'గామోసు లయలాగా వూగుతూ నన్ను ఊపేస్తుంది. చేత్తో తడిమాను.

నా గుండె ఆగిపోయినంత పనయింది. పాములు, చీకట్లో ఎక్కడ చూసినా పాముల కళ్లే మిలమిలమని మెరుస్తూ. నేను పాముల కుప్పపై పడ్డాను. చిత్రంగా! ఒక్కటీ నన్ను కాటువేయలేదేం!?

కొన్ని వేల లక్షల సంఖ్యలో కనిపిస్తున్నాయి పాముల కళ్లు, చిన్న చిన్నగా మిణుగురు పురుగుల గుంపులా. ఒళ్లు జలదరించింది, ఏం చేయాలో అర్థం కావడంలేదు. అసంకల్పిత ప్రతీకార చర్యగా నా పాంటు తడిసిపోయింది.

నా మొహం దగ్గరగా శ్వాస చప్పుడు వినిపించింది. నాలా ఇంకెవరయినా పడ్డారా ఏంటి, ఈ నాగలోకంలో? నాకో తోడు దొరుకుతుందన్న ఆలోచన నన్ను ఆనందపరిచింది. కళ్లు చిట్లించుకుని చూసాను ఎవరైనా కనబడతారని.

ఊపిరి ఆగిపోయినంత పనయింది. ఓ పాము నా ముఖంలో ముఖం పెట్టి చూస్తోంది. దాని 'బుస' శబ్దమే నాకు శ్వాసలా వినిపించింది. ముందుకి వెనక్కి ఆడిస్తున్న దాని నాలుక నా ముక్కుకి తగుల్తోంది. భయం నన్ను ఉప్పెనలా ముంచేసింది, గజగజ వణికిపోతూ గట్టిగా అరిచాను, అలా అరుస్తూనే వున్నాను.

నా అరుపుకి ఆ పాము కూడా జడుసుకుందేమో వెంటనే కసిగా నా 'నాలుక'పైన కాటేసింది.

ట్ర్ర్ర్ర్..

* * *

ఉలిక్కిపడి లేచాను 'అలారం' చప్పుడికి.

అయితే ఇదంతా 'కల' అన్నమాట. బతికిపోయాను.

ఆ పీడ కలకి నాకు నిజంగానే చెమట పట్టేసింది.

నా లుంగీ వంక చూసుకున్నాను. అదృష్టం బానే వుంది, అదేం తడవలేదు.

వంటింట్లోంచి అమ్మ తమ్ముడిపై కాపోలు అరుస్తోంది. టైం పీస్ వంక చూసాను. తొమ్మిదయింది.

వామ్మో? అదిరిపడ్డాను.

పదింటికి 'సీత' 'గ్లామర్ రెస్టారెంట్'కి రమ్మంది. గబగబా లేచి బాత్‌రూమ్‌లోకి దూరి, ఏకంగా అన్ని పనులూ కానిచ్చేసుకుని బయటపడ్డాను.

అమ్మ తిడుతూనే వుంది, కాపోతే ఈసారి నన్ను.

ఎక్కడికిరా ఆ పరుగంటూ.

అవన్నీ వినిపించుకోలేదు.

బీరువాలోంచి బ్లాక్ పాంట్, వైట్ బ్లూ ప్రింటెడ్ షర్ట్ తీసాను. సీతకి ఈ డ్రెస్సంటే ఇష్టం.

షర్ట్ వేస్కుని పెట్టి, పాంట్‌ని ఓ మారు దులిపి వేసుకున్నాను. బెల్ట్ తీసి సగం వరకు పెట్టుకున్నానో లేదో, పాంటు లోపల, కుడి తొడపైన ఏదో కదిలినట్టయింది.

సన్నగా వొణుకు మొదలయింది వెన్నులోంచి.

అది పామే, సందేహం లేదు.

ఎక్కడ కదిలితే ఎక్కడ కాటు వేస్తుందోనని వొణికిపోతూ రాయిలా నిల్చున్నాను.

నా తొడపై నుంచి ఓ అంగుళం కిందికి జారింది. ఆ స్పర్శకు వొళ్ళు జలదరించింది.

మెల్లిగా తమ్ముణ్ణి పిలిచాను.

'ఏంటి' అంటూ పక్కన్నుంచే బదులిచ్చాడు రాస్కెల్.

'శ్రీను క్విక్ రా' గాబరాగా పిలిచాను, గొణుక్కుంటూ వచ్చాడు.

అలా బిగుసుకొని నిల్చున్న నన్ను చూసి ఆశ్చర్యపోతూ ఏదో అనబోయాడు.

పెదవిపై వేలుంచి 'ష్' అని శబ్దం చేసాను.

సగం నా తొడపై ఉబ్బెత్తుగా వున్నదాన్ని చూపిస్తూ 'పాము' అన్నాను మెల్లిగా.

నా ఒళ్లూ షర్ట్ చెమటకి తడిసిపోయింది.

దేవుడా! ఈ కష్టం పగవాడిక్కూడా కలుగ కాకూడదంటూ వేడుకున్నాను.

శ్రీను పరిగెత్తుకుంటూ వెళ్లి ఓ కర్ర తీసుకొచ్చాడు. వాడికి నాకంటే కాస్త ధైర్యం ఎక్కువే.

'అన్నయ్యా, ఒకసారి ఆ కాలుని ఝాడించు, అది కింద పడుతుంది' అన్నాడు.

వాడి ఉద్దేశం ఏంటేమో, అది ఈసారి నా మోకాలిపైకి చేరింది.

నేను ఊపిరి బిగబట్టుకుని నిల్చున్నాను.

'ఒసారి కాలు ఝాడించన్నయ్యా' విసుక్కున్నాడు వాడు.

రెండు చేతులూ జోడించి, కనిపించని ఆ దేవుణ్ణి తలుచుకుని మొక్కాను.

శ్రీను కర్ర పట్టుకుని రెడీగా వున్నాడు, నా ఝాడింపుకి అది కింద పడగానే వేటు వేయడానికి.

నా శక్తినంతా నా కుడి కాల్లోకి తెచ్చుకున్నాను.

ఒక్కసారిగా కాలుని ఝాడించాను గట్టిగా.

నా మోకాలిపై నున్నది మా తమ్ముడి ముందు పడడం, వాడు కర్ర తీసుకుని గట్టిగా ఓ వేటు వేయడం వెంట వెంటనే జరిగిపోయాయి. నేను, శ్రీను జరిగింది అర్థం చేసుకోవడానికి క్షణం పట్టింది. తరువాత నా పాంటులోంచి జారిపడ్డదాన్ని చూసి, కడుపు పట్టుకుని నవ్వసాగాడు, నాకూ నవ్వాగింది కాదు. కానీ, అదే నిజంగా పామయితే?



జరిగింది మరిచి ఆ కిందపడ్డదాన్ని తీసి నా ఎడం జేబులోకి తోసాను.

శ్రీను ఇంకా నవ్వుతూనే వున్నాడు. అసలేం జరిగిందంటే నా పాంటు కుడి జేబుకి రంధ్రం అయింది. అందులో పెట్టిన నా జేబు రుమాలు, నేను పాంటు దులిపినప్పుడు మెల్లిగా రంధ్రంలోంచి కిందికి జారి ఇంత పనిచేసింది.

అని ముగించాను.

సీత ఆగకుండా, ఆపకుండా నవ్వుతోంది, కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. ఆ రెస్టారెంట్‌లో కూర్చున్న వాళ్లంతా మమ్మల్నే చూడసాగారు ఆశ్చర్యంగా.

సీత నన్ను వెక్కిరిస్తూ నవ్వసాగింది.

నేను సీతతో మెల్లిగా చెప్పాను.

''లేటయిందని నేను చెప్పిన 'కహానీ' అంతా నమ్మేసావన్నమాట''.

ఉక్రోశం ఆపుకోలేక వెంటనే నా తొడపై గట్టిగా గిల్లింది సీత.

ఈసారి నేను నవ్వసాగాను.